# మనస్సు చిగర్చటమా - మాను చిగర్చటమా

జగ జిగీష్ శరదమ్మకు ఏకైక పుత్రుడు, ఆపె పేరు శరదమ్మ. "శారదమ్మ" అనుకునేరు గనుక పాఠకులు. ఈ పరాకు ఎందుకు సూచిస్తూ వున్నానూ అంటే ఒక పేరుకు ఒక పేరు తారుమారుగా గొన్నారా యంటే మనుష్యులే మారిపోగలరు మీ దృష్టి పథంలో. మరిన్నీ శరదమ్మ వితంతువు. శారదమ్మ లందరూ సౌభాగ్యవతులై యుండవచ్చును ఈ లోకంలో. వితంతువైనా పునర్వివాహం చేసికోరాదా ఆవిడ యని అనుకోబోయినప్పుడల్లా ప్రజా వాక్యాని కడ్డంగా నిలుచున్నట్టు నిలబడి పోయి కనబడేవాడు జగజిగీష్.

తండ్రి పోయేసరికి జగజిగీష్‌కు మూడేండ్లో నాలుగేండ్లో ఆ పిల్లణ్ణి పెట్టుకు వాడి చదువు కోసంగాను, వాడి అయిదో ఏటే శరదమ్మ ఒక పట్నవాసంలో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం ఉంటూవచ్చింది. ఏది ఏర్పాటు చేసినా, ఏమి కొన్నా ఏమి వండుకున్నా జగజిగీష్‌ను సంతృప్తిపఱచడానికి, సమాధాన పఱచడానికీ చేసేదికాని, తనకోసం ఒక్కటీ చేసుకునేదికాదు శరదమ్మ. ఆమెకు భర్త పోయినప్పటినుంచి మఱి పబ్బం లేదు పండగా లేదు.

అయినా పిల్లవాడికొఱకు రేడియో కొంది. కుర్చీలు మేజా బల్లలు అవీ చావడిలో అమర్చి వుంచింది. పెద్ద రెండంతస్తుల యిల్లు అద్దెకు తీసుకుంది. విశాలమైంది వొకటి, రెండో అంతస్థు మీద్ది టెర్రేసు! కాని టెర్రేసు ఎప్పుడూ ఆమె ఎక్కిందిలేదు. అసలు రేడియో అమర్చిన ఆసామీలే రేడియో గడకర్రకూడా

పెర్వేసు మీద నిలిపారు. పిల్లడు మాత్రం రోజూ ఇల్లంతా తిరుగుతూ, పెరేసు ఎక్కుతూ అతి స్వేచ్ఛగా అతి అప్-టు-డేట్ ఊహల్తో " మాంటుసోరి " ఛాత్రుడిలా అయిదో ఏటనుంచి పెరుగుతూ వచ్చాడు. వాడి కేవేవో కథలు వినిపించేది శరదమ్మ. కబుర్లు చెప్పేది.

ఒకనాడడిగాడు జగజిగీష్ " అమ్మా ! ఉగాది ఎప్పుడు అని—అప్పటి కింకా వాడికి పదేళ్ళైనా లేవు. చైత్రశుద్ధ పాడ్యమికి అంటే వాడికి తెలుస్తుందా ?....

" మోళ్లు చిగిరించాలిరా ! " అంది. అంటే పిల్లడు " మోడంటే ? " అన్నాడు. " తనలాంటిది " అని శరదమ్మ తొ త్త అనబోయి, పిల్లడి కది విచారకారణం కావచ్చునని వెనకాడి, " మన పెరేసుమీది గడకర్రలాంటిది " అంది.

నాటినుంచీ జగజిగీష్ ఆ గడకర్రకేసిచూస్తూ,

అదెప్పుడు చిగిరిస్తుందో అని కాసుక్కూర్చునేవాడు. అయితే రేడియో వాగే నిమిత్తం నెలకొల్పిన గడకర్ర ఎన్నడైనా చిగిరిస్తుందా ? ఆ గడకర్రల వాలకం, దిష్టిబొమ్మలకు బదులు మంచి మంచి మేడలమీద ఉంచినవేమో అన్నట్టు, పీలగా, పేలవంగా, వాలిపోతూ, బ్రహ్మాండమైన హర్మ్యాల అందంకూడా చెడగొడుతూ దండెపు కర్రలకంటె అన్యాయంగా కనిపిస్తాయి. అవి చిగిర్చేదేమిటీ—ఏదో మాటవరసకు అంది కాని శరదమ్మ.

ఎట్టకేలకు నిజంగా ఉగాది ఉదయం వచ్చింది. జగజిగీష్‌కు నాడు తలంటి, కొత్తబట్టలు తొడిగి, చీకటితోనే తినీ ఆహారంగా వేపపువ్వు పచ్చడి నవకాయ రుచుల్తోటీ తినిపించింది తల్లి.

తింటూ తింటూ వున్న జగదీష్‌కు ఏమిజ్ఞాపకం వచ్చిందో- చటక్కున పై చష్టా మీదకు పరుగెత్తుకెళ్ళి క్రిందికి తిరిగివచ్చి "అమ్మా! ప్రేసు మీద గడకర్ర చిగిరించలేదేం? ఉగాది పండగ వచ్చినా?" యని అడిగాడు.

ఆలోచించి, కంట తడిపెట్టుకుంటూ—"మనస్సు చిగిరించడమే యుగాది. మాను చిగిరించడమనేదికాదు. ఇది ఇంత చిన్న బిడ్డకు బోధించే దేలా?" యని అనుకుంది శరదమ్మ. మోడువారిన ఆమె మనస్సు ఆమె కన్నీటి తడికి చిగిరించినట్టయి ఆమె భర్త రూపాన్ని కట్టెదుట చెట్టు చిగురుకంటె అప్రయత్నంగా ప్రదర్శించింది.

జగజిగీషుకుకూడా కన్నీళ్లోడ్తో కారసాగినై. కాని ఆబుద్ధిమంతుడు తన కన్నీటిని తల్లికి కాపరచకుండా ప్రేసుమీదకు వెళ్ళిపోయి, ఊరకే "ఏరియల్" మీదకు విదురుస్తూన్నాడు. తల్లి వాని వెనకాతలే పరుగెత్తుకెళ్ళి—"అదేం పనిరా" అంటే "యాజ్ఞవల్క్య మహర్షి ప్రాణం లేని కర్రపీటాన్ని చిగిర్చేటట్టు చేయలే?—మొన్న చెప్పావు కథ: నేనూ నా కన్నీటితో ఈ ఎండుకర్ర చిగిరించాలని కోరుతూ వున్నాను" అన్నాడు జగజిగీష్.

"నాయనా? మఱి నీ మనస్సు నేడు క్రొంగ్రొత్త చిగిరించిందోయి! నేడే నిజమైన ఉగాది మనకు" యని కుమారుని తల్లి మూర్కొంది.—

.... .... .... .... ....